# స్వచ్ఛ భారత్ భేరీ

- ఊరూవాడా వెల్లివిరిసిన ఉద్యమస్ఫూర్తి
- వారం పాటు ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు

ఈనాడు - దిల్లీ

దేశవ్యాప్తంగా పారిశుద్ధ్యంపై చైతన్యం తెచ్చేందుకు... ప్రజలను స్వచ్ఛభారత్ ఉద్యమంలో మరింతగా భాగస్వాములను చేసేందుకు కేంద్రం సర్వసన్నద్ధమైంది. 'స్వచ్ఛభారత్ వారోత్సవాలు' ఆదివారం మొదలైనాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పల్లెలు, పట్నవాసాల్లో ర్యాలీలు, శ్రమదానాలు, గ్రామ, వార్డుస్థాయి సమావేశాలను నిర్వహించారు. ఇక, బిగ్ బీ అమితాబ్ బచ్చన్, క్రికెట్ వీరుడు సచిన్ టెండూల్కర్‌లు వ్యాఖ్యాతలుగా తయారుచేసిన స్వచ్ఛభారత్ దృశ్యశ్రవణ ఉద్యమాన్ని కేంద్రమంత్రి తోమర్ సోమవారం దిల్లీలో ప్రారంభిస్తారు. అమితాబ్, సచిన్‌లను స్వచ్ఛభారత్ రాయబారులుగా ప్రధాని ప్రత్యేకంగా ఎంపిక చేసిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, నరేంద్రసింగ్ తోమర్, సురేష్‌ప్రభులు ఆదివారం కేరళలోని కొజికోడ్ రైల్వే స్టేషన్‌లో 'స్వచ్ఛభారత్ వారోత్సవానికి' శ్రీకారం చుట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు, ప్రజలు పెద్దసంఖ్యలో కొజికోడ్‌లో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. 'అంత్యోదయ' పితామహుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతిని పురస్కరించుకుని మొదలైన ఈ వారోత్సవాలు జాతిపిత మహాత్మాగాంధీ శతజయంతి రోజైన అక్టోబరు 2వ తేదీవరకూ సాగుతాయి. స్వచ్ఛభారత్ (మిగతా 2లో)

## 30న 'ఇండోశాన్' సదస్సు!

ఈ నెల 30న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిల్లీలో భారత పారిశుద్ధ్య సదస్సు(ఇండోశాన్)ను ప్రారంభిస్తారు. కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, 'అమృత్' నగరాల పురపాలక కమిషనర్లు, ప్రయివేటు సంస్థలు, ఎన్జీవోల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో 'ఇండోశాన్'కు హాజరుకానున్నారు. 2019 నాటికల్లా 'స్వచ్ఛభారతావని'ని సాధించాలన్న లక్ష్యం... ఈ రెండున్నరేళ్ల కాలంలో ఎదుర్కొన్న సవాళ్లు, సొంతం చేసుకున్న విజయాలపై ఈ సదస్సులో చర్చిస్తారు.

# స్వచ్ఛ భారత్ భేరీ

(మొదటి పేజీ తరువాయి)

వారోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంచినీటి, పారిశుద్ధ్యశాఖ గ్రామీణ ప్రాంతాల కోసం .....పట్టణ ప్రాంతాల కోసం పట్టణాభివృద్ధి శాఖలు విస్తృత కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాయి. మరిన్ని గ్రామాలు, జిల్లాలు, నగరాలు బహిరంగ బహిర్భూమి దురాచారం నుంచి విముక్తమయ్యేలా చూడటమే ఈ కార్యాచరణ ప్రణాళికల లక్ష్యంగా ఉంది. మరుగుదొడ్లను ఉపయోగించుకునేలా ప్రజల ప్రవర్తనలో మార్పు తేవడమే ధ్యేయం. ఇందులో భాగంగా తొలిరోజైన ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యకర్తలు...ఆయా ప్రాంతాల్లోని స్వయం సహాయ బృందాలు, స్వచ్ఛందసంస్థల మద్దతుతో బహిరంగ మలవిసర్జన దురలవాటుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. గుజరాత్‌లోని కడోదరా, మాండ్వి పట్టణాలు ప్రస్తుతం నూటికి నూరుశాతం బహిరంగ మలవిసర్జన దారుణం నుంచి విముక్తమైనాయి. భారత నాణ్యతా మండలి(క్యుసీఐ) ఈ మేరకు ప్రకటన చేసింది.